క్లుప్తంగా

హరిహర క్షేత్రంలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీ నగర్–1లోని హరిహర క్షేత్రంలో పోలి పాడ్యమి సందర్భంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. యువసేన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్–2 వార్డెన్‌గా సరోజిని



బాధ్యతలు చేపట్టిన సరోజిని

సీతమ్మధార: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్–2 వార్డెన్‌గా మైలపల్లి సరోజిని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె మధురవాడలో పనిచేశారు. ఇక్కడ కొద్ది రోజులుగా హాస్టల్–2కు వార్డెన్ లేకపోవడంతో బాయ్స్ హాస్టల్ వార్డెన్ ప్రసాదరావు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ సందర్భంగా సరోజిని మాట్లాడుతూ హాస్టల్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించొద్దు

మహారాణిపేట: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ప్రతిపాదనలు విరమించుకోవాలని హ్యూమన్ రైట్స్ సోషల్ యాక్షన్ కో ఆర్డినేటర్ గుండు అప్పలరాజు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన వినతిపత్రం సమర్పించారు. పోర్టులో పనిచేస్తూ రిటైర్ అయిన ఉద్యోగులు, పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ఈ ఆస్పత్రి నిర్మాణం జరిగిందని, దీనిని పోర్టు ఆధ్వర్యంలోనే నిర్వహించాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగులకు ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో అందవని, అందువల్ల ప్రభుత్వరంగ పరిశ్రమల పరిధిలోనే కొనసాగించాలని కోరారు. దీనిపై పోర్టు యాజమాన్యం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని అప్పలరాజు కోరారు.

రైల్వేలో క్యాటరింగ్ సేవలపై ప్రత్యేక తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రయాణికులకు అందుతున్న క్యాటరింగ్ సేవలపై ప్రత్యేక తనిఖీలు ప్రారంభించినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. వాల్తేర్ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లు, రైళ్లలో ఈ తనిఖీలు ప్రారంభించారు. కమర్షియల్ విభాగం నుంచి సీనియర్ సూపర్‌వైజర్లు మొత్తం 20 మందితో కూడిన బృందం ఈ తనిఖీలు చేస్తోంది. డివిజన్ పరిధిలోని ఇతర స్టేషన్లతోపాటు విశాఖపట్నం రైల్వే స్టేషన్, రైళ్లలోను క్యాటరింగ్ సేవలను పరిశీలించారు. అధిక ధరలకు అమ్మడం, ఆహార పదార్థాల నాణ్యత, ప్రమాణాలు వీరు తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలను అందించడంతోపాటు ఆహార ప్రమాణాలు పాటించేలా చేయడం ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశ్యమని సీనియర్ డీసీఎం తెలిపారు.

విజేతలకు బహుమతులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ సాక్షరతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 'టెక్స్‌ప్లోర్–2024' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాండ్స్ ఆన్ హచ్, కీస్ట్రోక్ చాంపియన్, లింక్ క్వెస్ట్‌ల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ బహుమతులు అందజేశారు. డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఇ. హరిణీ, జి.దీప్తి ఎస్.మాధురి, జె.అనితరాణి, కె.ధార, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిష్కృత ఘనం.. బోధకులు శూన్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చిన విషయం తెలిసిందే. కార్పొరేట్ స్కూళ్లకు మించిన సౌకర్యాలు, ఇంగ్లిష్ మీడియం బోధన, డిజిటల్ క్లాసులు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తోంది. మెర్జింగ్ పేరుతో ఉపాధ్యాయులను తరలించడంతో టీచర్ల కొరత ఏర్పడింది. పాఠశాలలో సరిపడా టీచర్లు కూడా నియమించడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడిచినా.. జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలకు సరిపడా టీచర్లు లేక సక్రమంగా బోధన సాగడం లేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- స్కూళ్లు ప్రారంభమై ఆరు నెలలు గడిచినా కానరాని నియామకం
- మెర్జింగ్ పేరుతో గత ప్రభుత్వం నియమించిన ఐదుగురు ఎస్జీటీల తరలింపు
- సక్రమంగా సాగని విద్యా బోధన
- నియామకాలు చేపట్టాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



టీచర్ లేక విద్యార్థులను నియంత్రిస్తున్న క్లాస్ లీడర్

సీతంపేట: వందేళ్ల చరిత్ర గల జీవీఎంసీ ఉర్దూ పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఈ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా బోధనను చాలీచాలనీ టీచర్లతో నెట్టుకొస్తున్నారు. ఇక్కడ ఉర్దూ టీచర్ కొరత ఉంది. ఈ పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైమరీగా ఉన్న ఈ పాఠశాలను 2017లో యూపీ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరగతులకు సరిపడా ఎస్జీటీలను నియమించింది. నాడు ఎనిమిది మంది ఎస్జీటీలు ఉండగా.. ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. కూటమి ప్రభుత్వం మెర్జింగ్ పేరిట గత సెప్టెంబర్‌లో ఐదుగురు ఎస్జీటీలను మండలంలోని వేర్వేరు పాఠశాలలకు తరలించింది. ప్రస్తుతం 8 మంది ఉపాధ్యాయులు మాత్రమే బోధిస్తున్నారు. 1, 2 తరగతులకు ముగ్గురు ఎస్జీటీలు అవసరం కాగా.. ఇద్దరు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు అంధుడు కాగా.. ఒకరు మెటర్నిటీ లీవ్‌లో ఉండగా, మరొకరు వచ్చే ఏడాది ఆగస్టులో పదవీ విరమణ చేయనున్నారు.

పూర్వ వైభవం తీసుకురండి

సరిపడా టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదిలో గొడవలు పడుతున్నారు. ఉపాధ్యాయుల కొరత తొలగాలంటే ఇద్దరు ఎస్జీటీలు, హిందీ బోధనకు మరో టీచర్‌అవసరం ఏర్పడింది. ఉర్దూ సబ్జెక్ట్ బోధనకు ఒకే ఒక్క టీచర్ ఉండటంతో 1 నుంచి 8 తరగతుల వరకు ఒక్కరే బోధించాల్సి వస్తోంది. ఉర్దూ బోధనకు మరొకరిని నియమించాల్సిన అవసరం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఘనమైన చరిత్ర ఉన్న ఉర్దూ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను నియమించి పూర్వ వైభవం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ముస్లిం తాటిచెట్లపాలెంలోని జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

రెండు క్లాసులకు ఒకే టీచర్

ఉర్దూ పాఠశాలలో 3 నుంచి 8 తరగతులకు సబ్జెక్ట్ వైజ్ బోధనకు సరిపడా టీచర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమినిది మంది టీచర్లలో ఎవరైనా సెలవు పెడితే రెండు క్లాసులకు ఒకే టీచర్ చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు పాఠశాల నిర్వహణ పనుల భారంతో అన్ని తరగతుల నిర్వహణ కష్టంగా మారింది. అపార్ ఆన్‌లైన్ పనులు, మరోవైపు ఈ నెల 7న జరగనున్న మెగా పీటీఎంకు ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయాల్సి రావడంతో టీచర్ల కొరత మరింత తలనొప్పిగా మారింది. నిర్వహణ పనులు ఒకవైపు, సంవత్సరాంతం కావడంతో ఉపాధ్యాయులు సెలవు పెడుతుండటం వల్ల తరగతులను క్లాస్ లీడర్లకు అప్పగించాల్సిన పరిస్థితి నెలకొంది.

పిల్లలను బడికి పంపేదెలా..



మా పాప, బాబు ఉర్దూ స్కూల్‌లో చదువుతున్నారు. సరిపడా టీచర్లు లేక ఆరు నెలలుగా ఇబ్బంది కలుగుతోంది. 3 నుంచి 8 తరగతులకు సబ్జెక్టుల బోధనకు అవసరమైన ఉపాధ్యాయులు లేరు. అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. ఉపాధ్యాయులు లేకుండా పిల్లలను ఎందుకు బడికి పంపడం. అధికారులు సమస్య పరిష్కరించాలి.

– మహబూబ్ నిషా, విద్యార్థుల తల్లి, అబిద్‌నగర్

ఆరు నెలలుగా టీచర్ల కొరత



ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న వారిలో ఎవరైనా సెలవు పెడితే రెండు తరగతులను కలిపి కూర్చోబెట్టడం లేదా క్లాస్ లీడర్‌కు అప్పగించడం చేస్తున్నారు. ఆరు నెలలుగా టీచర్ల కొరత వేధిస్తున్నా.. అధికారులు ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. ఉర్దూ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను నియమించాలి.

– ఇమంది సంతోషిని, విద్యార్థి తల్లి

6న కులశేఖర్ సంస్మరణ సభ

మద్దిలపాలెం: నగరానికి చెందిన ప్రముఖ తెలుగు గేయ రచయిత కులశేఖర్ సంస్మరణ సభ ఈ నెల 6న విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలంలో పుట్టి, బీవీకే డిగ్రీ కళాశాలలో ఆయన చదువుకున్నారన్నారు. వై.సత్యారావు మాస్టర్ ఆశీస్సులతో సినీ గేయ రచయితగా మారి అనేక చిత్రాలకు పాటలు రాసి కీర్తి గడించారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయం హాల్‌లో ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ వై.సత్యారావు, సహ విద్యార్థి, ప్రస్తుత రచయిత(సింహాచలం) లోగిస లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొని నివాళులర్పిస్తారని చెప్పారు. కులశేఖర్ మిత్రులు, బంధువులు, అభిమానులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



మహిళలను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

సీతంపేట: అక్కయ్యపాలెం శ్రీగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ ఆలయ ప్రాంగణంలో గౌరీపరమేశ్వరుల రెండో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 35 రోజుల పాటు లలితా పారాయణ, భజన చేసిన గ్రామ మహిళలకు చీర తాంబూలం ఇచ్చి సత్కరించారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, గౌరవ అధ్యక్షుడు పాలమరెట్టి ప్రసాద్, కమిటీ చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథ్, కోశాధికారి పిల్లా గోపి చేతుల మీదుగా సత్కార కార్యక్రమం జరిపారు. బొడ్డేటి ఆనంద్, పిల్లా పకీర్ నాయుడు, బొడ్డేటి కన్నారావు, పెంటకోట సత్యప్రసాద్, కళ్ల వెంకటరావు, సూరిశెట్టి వెంకటరావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐదో పట్టణ పీఎస్‌ను సందర్శించిన డీసీపీ

ఆర్టీసీ బస్సులో మహిళలపై దాడి కేసుపై ఆరా



దస్త్రాలు పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

మద్దిపాలెం: ఇటీవల ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలపై జరిగిన దాడి కేసులో పురోగతికి సంబంధించి డీసీపీ మేరీ ప్రశాంతి సోమవారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఆరా తీశారు. ఐటీఐ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలపై యాసిడ్‌తో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇది జరిగి రోజులు గడుస్తున్నా ఇంతవరకు దాడికి పాల్పడ్డ వారి ఆచూకీ తెలియకపోవడంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్పందించి సీఐలతో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే డీసీపీ మేరీ ప్రశాంతి కంచరపాలెం స్టేషన్‌కు వచ్చారు. ఇన్ని రోజులు గడుస్తున్నా పురోగతి సాధించకపోవడంతో అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. కేసును సీరియస్‌గా తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని హితబోధ చేసినట్టు తెలిసింది. వాస్తవానికి డీసీపీ స్టేషన్‌ను సందర్శిస్తారని పోలీసులకు ముందుగా తెలిసినా.. మీడియాకు మాత్రం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వినతులకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్



పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్న జోన్–3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి వాటిని స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ, ఇబ్రహీం, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ఆశీలమెట్టలోని జోన్–3 కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ రెండు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ గంగాధర్, డీఈ పద్మావతి, ఏఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి, టీపీఎస్ నారాయణరావు, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్‌వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



జోన్–5 కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జెడ్సీ తారా ప్రసన్నరెడ్డి

జోన్–5 కు రెండు వినతులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్, ఈఈ తారా ప్రసన్నరెడ్డి వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02 వినతులు అందినట్లు ప్రసన్నరెడ్డి తెలిపారు. రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఎస్.పుణ్యవతి, కృపానందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏపీపీసీబీ జోనల్ కార్యాలయంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, ఏయూ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ బాలప్రసాద్, ఏపీపీసీబీ మాజీ సీఈఈలు ఎస్.వి.భాస్కరరావు, కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలిచ్చారు. కాలుష్య నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలను విశదీకరించారు. కార్యక్రమంలో శ్రావణ్ షిప్పింగ్ ఎండీ సాంబశివరావు, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి రత్నం, జేసీఈఈ డాక్టర్ పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంలో పాల్గొన్న పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



మురళీనగర్ రామాలయం వద్ద కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు



పార్వతీశ్వరాలయంలోని కృత్రిమ కొలనులో దీపాలు వదులుతున్న భక్తులు



మద్రిపాలెం ఆలయం వద్ద కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు





కంచరపాలెం ధర్మానగర్ శివాలయం వద్ద కోనేరులో దీపాలు వదులుతున్న మహిళలు

సీతంపేట: నియోజకవర్గంలోని శివాలయాల్లో సోమవారం పోలి పాడ్యమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో వేకువజామున మహిళలు దీపాలు వదిలి కైలాసనాథుడిని సాగనంపారు. సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయాల్లోని కొలనుల్లో వేకువజాము నాలుగు గంటలే నుంచే మహిళలు అరటి జోరుపై దీపాలను ఉంచి నీటిలో వదిలిపెట్టారు. ధ్వజ స్తంభాల వద్ద దీపారాధనలు చేశారు. అనంతరం భక్తులు అర్చకులకు స్వయం పాకం, సాలిగ్రామ, దీప దానాలిచ్చారు.

శివయ్యకు పూజలు

మద్రిపాలెం: మాధవధార మాధవ స్వామి ఆలయ, మద్రిపాలెం పంజాబ్ హోటల్ దరి కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తులు వేకువజాము నుంచి శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద కృత్రిమ కొలనుల్లో దీపాలు వదిపెట్టారు.

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన కృత్రిమ నీటి కొలనులో శివుడికి దీపారాధన చేశారు. మహిళలు అరటి దొప్పల్లో నెయ్యి, నూనె వత్తులతో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు మంచిలి భానుమూర్తి, భోగాపురపు ప్రసాదశర్మల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. అర్చకులకు స్వయం పాకాన్ని భక్తులు దానమిచ్చారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల ధర్నా

సీతంపేట: విశాఖ కో–ఆపరేటివ్ డైరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, అధ్యక్షుడు కె.శ్రీనివాస్, డైరీ యూనియన్ అధ్యక్షుడు వరాహమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ డైరీ యాజమాన్యం 20 ఏళ్లుగా కార్మికులకు చట్టబద్ధంగా రావలసిన హక్కులను కల్పించడం లేదన్నారు. 15 ఏళ్ల నుంచి అగ్రిమెంట్, ట్రైనీల పేరుతో ఉద్యోగాలు రెగ్యులర్ చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 6న సమ్మెకు వెళ్లేందుకు డైరీ ఉద్యోగులందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణ, వెంకట అప్పారావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు సమీనా



సమీనాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సిబ్బంది

సీతమ్మధార: మహారాష్ట్రలోని సంభాజీనగర్ నివాసి సమీనా(అలియాస్ సఫియా) 30 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. మూడు నెలల క్రితం విశాఖ వచ్చి రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఏయూటీడీ సిబ్బంది ఆమెను మహిళా షెల్టర్‌కు తరలించారు. ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సిబ్బంది అందించిన సేవలకు త్వరగా కోలుకోవడంతో సఫియాను ఆమె మేనల్లుడు, అన్నయ్యలయిన జమీర్ ఖాన్, ఇజాజ్ ఖాన్‌లకు అప్పగించారు.

వ్యక్తిపై దౌర్జన్యం చేసిన ముగ్గురి అరెస్ట్

సీతమ్మధార: గంజాయి మత్తులో ప్రయాణికుడిపై దౌర్జన్యం చేసి పర్సు, ఫోన్ కాజేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన మహంతి రామకృష్ణంనాయుడు సోమవారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో గల సీఎంఆర్ బస్‌స్టాప్ వద్ద నిల్చొని ఉన్నాడు. విజయవాడకు చెందిన జంప హరి, రైల్వే న్యూకాలనీకి చెందిన జాజుల నాగరాజు, కొమ్మాదికి చెందిన ధనాల సంతోష్ మోటార్ సైకిల్‌పై అక్కడికి వచ్చి రామకృష్ణంనాయుడిని అడ్డగించారు. అందరూ చూస్తుండగానే చేతులు వెనక్కి నొక్కి జేబులో ఉన్న సెల్‌ఫోన్, పర్సు, బ్లూటూత్ లాగేసుకొని అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుడు 112కు కాల్ చేయగా ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు అక్కడకు చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ముగ్గురిని డీఆర్ఎం ఆఫీస్ వద్ద అరెస్ట్ చేసి వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు క్రైం ఎస్ఐ సత్యారావు తెలిపారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మూర్తి తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నరసింహ నగర్ శివారు గణేష్‌నగర్‌లోని వర్డ్ ఆఫ్ గాడ్ ఆఫ్ మినిస్ట్రీస్ క్రైస్తవ మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ స్టీఫెన్ పీటర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథి శ్రీ గణేష్ సేవా సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన డ్యాన్స్, గేమ్స్, డిబేట్, సాంగ్స్ పోటీల్లో విజేతలకు అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పేద క్రిస్టియన్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శామ్యూల్ కోయిర్ టీమ్ మంచి మ్యూజిక్‌తో క్రిస్టియన్ పాటలు ఆలపించి అలరించారు. సోని, సుభాషిణి, విజయవర్ధిని, రాధ, భాగ్యవతి కార్యక్రమాన్ని ఆర్గనైజ్ చేశారు. అధిక సంఖ్యలో క్రైస్తవ మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.